సందడిగా సంచార జాతుల విముక్తి దినోత్సవం

ముషీరాబాద్: సంచార జాతుల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని అడిక్‌మెట్ శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... తెలంగాణలో 36 సంచార జాతులు నివసిస్తున్నట్లు తెలిపారు. సంచార జాతుల అభ్యున్నతికి మరింత చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, డీఎస్‌టీ సెల్ సభ్యులు శ్రీనివాస్, కొండయ్య, నర్సింగ్, చిత్తరంజన్, కుమార్‌లతో పాటు సంచార జాతుల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బిల్వార్చన



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయంలో సోమవారం స్వామి వారికి బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజలలో బ్రహ్మశ్రీ కాసుల రాధాకృష్ణశర్మ, అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని బిల్వార్చలతో అభిషేకించారు. చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఈవో పి.లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు గజానంద్, బండారు నవీన్, బాబ్జీ సాయికీర్త్, గుర్రం దినేష్, దోనేటి బానుచందర్‌లు, భక్త బృందం పాల్గొని పర్యవేక్షించారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



లేబర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

చిక్కడపల్లి: ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం యాజమాన్యాలు ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.ఈశ్వర్‌రావు అన్నారు. సోమవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల కన్వర్షన్ కోసం నగర కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఏర్పాటు చేసిన కన్సిలేషన్ సమావేశాన్ని వాయిదా వేయడం సరికాదన్నారు. వాయిదాకు అసెంబ్లీ సమావేశాలను సాకుగా చూపడమేమిటని ప్రశ్నించారు. కార్మికులకు సరైన న్యాయం చేయకుండా యాజమాన్యాలు చెప్పినట్లు ప్రభుత్వం నడుస్తున్నట్లుగా ఉందని విమర్శించారు. త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్మిక శాఖ నగర జేసీఎల్ సునీతకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో నేతలు నరేందర్, వెంకటేష్, చంద్రారెడ్డి, లింగం, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా చూడాలి

చిక్కడపల్లి: విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ సంబంధిత శాఖ అధికారులను కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ముందు నిర్మిస్తున్న షెడ్డుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు అడ్డుగా వస్తున్నాయని స్థానికులు కార్పొరేటర్ పావని దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం స్పందించిన ఆమె విద్యుత్ శాఖ డీఈ నెహ్రూనాయక్‌తో మాట్లాడి హైటెన్షన్ విద్యుత్ తీగలను సరిచేయాలని కోరారు. అధికారులు సోమవారం సంబంధిత తీగలను సరిచేశారు. ఈ పనులను వినయ్‌కుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సంపత్, సీబీడీ డీఈ వినోద్, ఏఈ సంతోష్, నేతలు నవీన్‌కుమార్, ఆనంద్‌రాఆవు, కమిటీ సభ్యులు నవీన్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచి కాళోజీ

చిక్కడపల్లి: నాటి నిజాం నిరంకుశ పాలనను ఎదురించి పోరాడిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. సోమవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు యాదిలో.. శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రజాకార్ల ఆకృత్యాలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాన్ని వినిపించారని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. కాళోజీ మాతృభాషా స్ఫూర్తి తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు ఆత్మీయ నిర్మల, స్వామిచౌదరి, గాంధీ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంబురం

- సన్నబియ్యం పంపిణీతో రేషన్ దుకాణాల్లో సందడి
- అంబర్‌పేట నియోజకవర్గంలో 5–7 వేల కొత్త రేషన్‌కార్డులు
- కొత్త రేషన్‌కార్డులు మంజూరైన వారికి సైతం రేషన్
- ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ పంపిణీకి చర్యలు



పౌర సరఫరాల శాఖ సర్కిల్–6లోని ఓ దుకాణం

అంబర్‌పేట: మూడు నెలల విరామం తర్వాత రేషన్ దుకాణాలు తెరుచుకున్నాయి. మూడు నెలల క్రితం మూడు నెలలకు సరిపరా రేషన్ పంపిణీ జరగడంతో రేషన్ దుకాణాలు మూడు నెలల పని చేయలేదు. నేటి నుంచి అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న రేషన్ దుకాణాలు పంపిణీతో సందడిగా మారాయి. రేషన్ దుకాణాల్లో కార్డుదారులు రేషన్ పొందుతున్నారు. ఈ నెల సైతం సన్న బియ్యం పంపిణీ జరుగుతుండడంతో కార్డుదారులు బారులు తీరి తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో 42 రేషన్ దుకాణాలకు 70 నుంచి 80 వేల రేషన్‌కార్డు దారులు ఉన్నారు.

కొత్త వారికి సైతం పంపిణీ...

అర్హులైన వారికి జారీ చేసిన కొత్త రేషన్ కార్డుదారులకు సైతం రేషన్ పంపిణీ చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 5 నుంచి 7వేల రేషన్ కార్డులు మంజూరు అయ్యాయి. రేషన్ దుకాణాదారులు కొత్త వారికి రేషన్ పంపిణీకి సన్నాహాలు చేసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత రేషన్ సరకులు పొందడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద ఎత్తున పెండింగ్...

కొత్త రేషన్ కార్డుల కోసం చేసుకున్న ధరఖాస్తుల్లో కొన్ని ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో దరఖాస్తుదారులు మంజూరు కోసం ఎదురుచుస్తున్నారు. మొదటి దఫా పంపిణీ అనంతరం కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియాలో తీవ్ర జాప్యం జరుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారు పదే పదే మీ సేవలోని ఆన్‌లైన్ రేషన్ కార్డు జారీ ప్రక్రియాను చుసుకుంటున్నారు. ఎప్పుడు చూసినా పెండింగ్ అని వస్తుండడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు. కొన్ని దరఖాస్తులకు స్థానికంగా విచారణ జరిగినప్పటికీ రేషన్ కార్డులు మంజూరు కాకపోవడం పట్ల పేదలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. స్థానిక కార్యాలయంలో ప్రక్రియా పూర్తి అయినప్పటికి ప్రధాన కార్యాలయంలో పెండింగ్ అని చెప్పడంతో ధరఖాస్తు దారులు ఎవరిని అడగాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పెండింగ్ రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



రేషన్ తీసుకుంటున్న స్థానికులు

సాఫీగా పంపిణీ జరిగేలా..

మూడు నెలల తర్వాత పంపిణీ జరుగుతున్న రేషన్ సరుకులు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. అలాగే కొత్త రేషన్‌కార్డులు మంజూరైన వారు ఈనెల నుంచి రేషన్ పొందవచ్చు.

– ఏఎస్‌ఓ దీప్తి, పౌరసరఫరాల శాఖ సర్కిల్–6

42 శాతం రిజర్వేషన్ల నిర్ణయం విప్లవాత్మకం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిజ్జి శత్రు

ముషీరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయమని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ జాతీయ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లను పెంచేందుకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి చట్టానికి సవరణ చేసి ప్రత్యేక బిల్లును తీసుకొచ్చి అసెంబ్లీలో ఆమోదింపజేశారన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుని సామాజిక న్యాయం చేశారని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్ల వల్ల బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగరంగాలలో ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. బీసీ బిల్లును గవర్నర్, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి వెనుకబడిన కులాలకు న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు న్యాయం చేసేందుకు ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి పూనుకుంటే బీఆర్‌ఎస్ ఎంపీలు ఏ ఒక్కరూ మద్దతు ఇవ్వలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతూ వెనుకబడిన వర్గాల పక్షపాతిగా ప్రభుత్వం నిలిచిందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చక్రం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్య

కాచిగూడ: ఐదు నెలల క్రితం వివాహమైన నవ వధువును కట్నం కోసం భర్త, అత్త వేధించడంతో ఆ వేధింపులు తాళలేక ఆ నవవధువు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన ధనరాజ్–రేష్మ దంపతుల కుమార్తె అక్షిత (17)ను నింబోలిఅడ్డకు చెందిన అర్జున్ ముంగానాల్ (26)కు ఇచ్చి ఏప్రిల్‌లో వివాహం చేశారు. వివాహ సమయంలో బంగారం, నగదు ఇచ్చారు. రూ.25వేలు ఇవ్వాల్సి ఉంది. కొన్ని రోజులుగా అక్షితను భర్త అర్జున్, అత్త మందబాయి కట్నం తేవాలని వేధింపులకు గురిచేస్తున్నారు. వారి వేధింపులు తాళలేక అక్షిత బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అక్షిత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలు తల్లి రేష్మ ఫిర్యాదు మేరకు సోమవారం కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానికసంస్థల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తరహాలు దివ్యాంగులకు కూడా ప్రత్యేక రిజర్వేషన్ తీసుకురావాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షుడు కటమోని వెంకటేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని తమ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడుతూ... అన్ని రాజకీయ పార్టీలు వికలాంగులను చిన్న చూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో గౌరవప్రదంగా జీవించడానికి దివ్యాంగులకు జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించి పాలకులు తమ చిత్తశుద్ధి చాటుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్ తీసుకురావాడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదించడం హర్షణీయమని అదే తరహాలో దివ్యాంగుకులకు కూడా రిజర్వేషన్ తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ సభ్యులు పాల్గొన్నారు

క్రైస్తవ సంఘాలు ఒకే తాటిపైకి రావాలి



డాక్టర్ కె.రూబెన్ మార్క్‌ను సన్మానిస్తున్న టీసీసీ ప్రతినిధులు

కవాడిగూడ: తెలంగాణలోని అన్ని డినామినేషన్ చర్చిలు ఒకే తాటిపై రావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని సీఎస్ఐ మోడరేటర్ డాక్టర్ కె.రూబేన్ మార్క్ అన్నారు. సోమవారం కవాడిగూడలోని ఏసీటీసీ కళాశాల ప్రాంగణంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... దేశంలో క్రైస్తవ సంస్థలు మత భేదం లేకుండా సేవలందించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిలర్ చర్చస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి. భాస్కర్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ ఆఫ్ ఇండియా నాయకులు డి. రాబర్ట్, సూర్యప్రకాష్, దళిత్ క్రిస్టియన్ నాయకులు స్లీవా తదితరులు పాల్గొన్నారు.

పాము కలకలం



ముషీరాబాద్: ముషీరాబాద్‌లోని చిలకలగూడ రిజర్వాయర్ ప్రాంగణంలో సోమవారం పాము కలకలం రేపింది. జలమండలి సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రిజర్వాయర్ ప్రాంగణం చెట్లు, గడ్డితో నిండిపోయింది. దీనితో జలమండలి సిబ్బంది ఏపుగా పెరిగిన గడ్డిని తొలగిస్తుండగా ఆరు అడుగుల పొడవైన విష సర్పం కనిపించడంతో సిబ్బంది పరుగులు తీశారు. ఈ విషయాన్ని జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీజీఎం మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ సురేష్‌లు స్నేక్ క్యాచర్లకు సమాచారం ఇచ్చి పిలిపించారు. వారు రిజర్వాయర్‌కు చేరుకుని పామును పట్టుకోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

బీసీ బిల్లుకు ఆమోదం తెలపడంపై సర్వత్రా హర్షం

చిక్కడపల్లి: బీసీ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నేతలు సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సంబురాలు నిర్వహించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంచిపెట్టారు. జై కాంగ్రెస్, జై రాహుల్‌గాంధీ.. జై రేవంత్‌రెడ్డి అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీడీ కృష్ణ, జీఎన్ కేశవ్, కల్పనాయాదవ్, హరికృష్ణ, అభిషేక్ కెన్నడీ, బంటారం యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న బిజ్జి కనకేష్ తదితరులు

ముషీరాబాద్: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జి కనకేష్‌కుమార్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లోని పోచమ్మ దేవాలయం ఎదురుగా కొన్ని నెలలుగా మట్టి కుప్పలు, చెత్తచెదారం పేరుకుపోయింది. మారడంతో బిజ్జి కనకేష్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు స్పందించి మట్టి కుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని సూచించారు. ప్రజలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని, ప్రజలకు రోగాలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, శివకుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న ఓ కళాశాల విద్యార్థులు



గణనాథుడి సన్నిధిలో శాస్త్రీయ నృత్యాలు చేసిన చిన్నారులతో భగాయత్ గణేశ్ అసోసియేషన్ ప్రతినిధులు



ఊరేగింపులో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు



పూల్‌బాగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పూజలో భక్తులు



బర్కత్‌పురలో పూజలో పాల్గొన్న సీడీవీ సుబ్బారావు



పూజలో ఊక సతీష్, మారుతీగుప్తా తదితరులు



నింబోలిఅడ్డలో కార్పొరేటర్ ఉమారాణి పూజలు



ఏకదంతం ఉపాస్మహే..

గణపతి బప్పా మోరియా



ఫ్రెండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దత్త పీఠం వద్ద గణపతి హోమం

'బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. గణపతి బప్పా మోరియా... ఆదా లడ్డు కాలియా'అనే నినాదాల మధ్య గణేశ్ మండపాల పరిసరాలు మార్మోగుతున్నాయి. చిన్నారులు, యువత ఉత్సాహంగా పూజల్లో పాల్గొంటూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం పూజలతో అంతటా ఆధ్యాత్మికత వెల్లువెత్తుతోంది. మండపాల వద్దకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు వచ్చి పూజల్లో పాల్గొంటున్నారు. కొన్నిచోట్ల నిత్యన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఐదు రోజులు పూర్తి కావడంతో ఆదివారం నుంచి వినాయకులు హుస్సేన్‌సాగర్‌కు నిమజ్జనానికి తరలివెళ్తున్నాయి.

– కాచిగూడ

బోలో గణేశ్ మహారాజ్‌కీ జై



వివేక్‌నగర్‌లో.. బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్



నల్లకుంటలో జరిగిన పూజలో వనం రమేష్



ఫ్రెండ్స్ కల్చరల్ మండపంలో మాజీ కార్పొరేటర్ పద్మ



బాగ్‌అంబర్‌పేటలో.. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



పటేల్‌నగర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య



నాగమయ్యకుంటలో.. బండారు విజయలక్ష్మి



అడిక్‌మెట్‌లో.. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణ



అడిక్‌మెట్‌లో.. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్



మహాత్మా యూత్ మండపంలో ఎమ్మెన్ శ్రీనివాసరావు పూజలు



సంజీవయ్యనగర్‌లో.. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్



విద్యానగర్‌లోని వీఎన్ జీపీలో..